క్లుప్తంగా

విద్యార్థికి 'బాసట'
మెడిసిన్ చదువు కోసం ఆర్థిక సాయం


లోకేశ్వర్‌కు చెక్కును అందజేస్తున్న బాసట సంస్థ సభ్యులు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం విద్యార్థికి చదువులకోసం ఆర్థికసాయం అందించింది. నగరానికి చెందిన విద్యార్థి లోకేశ్వర్ పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో వంద శాతం మార్కులతో ఉత్తీర్ణులై నీట్‌లో ర్యాంకు సాధించాడు. రేణిగుంటలోని బాలాజీ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు పొందారు. ఫీజులు, ఇతర ఖర్చుల కోసం కుటుంబ సన్నిహితుడు ఆనందరెడ్డి సహకారం కోరారు. ఆయన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు మేరువ బాలాజీరావు, డి.కార్తీక్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లడంతో వారు దాతల సహకారంతో రూ.70 వేలు సేకరించి ఆదివారం చెక్కు రూపంలో అందజేశారు. సాయం పొందిన విద్యార్థి, ఆయన తల్లి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాత్విక్, నిఖిల్, హర్షిత్, సాయితేజ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు


ఉద్యోగాన్ని సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటేనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను సులభంగా సాధించుకోవచ్చని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య పేర్కొన్నారు. కడపలోని గురుటెక్‌లో శిక్షణ తీసుకుని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలను సాధించిన 18 మంది విద్యార్థులను ఆదివారం గురుటెక్‌లో ఆ సంస్థ డైరెక్టర్ గురుస్వామి అధ్యక్షతన సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి, సంస్థ డైరెక్టర్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

కడప అర్బన్: కడప నగర శివార్లతోపాటు సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 2వ తేదీ నుంచి పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి తెలియజేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆటోడ్రైవర్లు యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ కలిగి వుండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో చేరవేయడం నిషేధమన్నారు. మోటార్ సైకిల్‌లో ట్రిపుల్ రైడింగ్ చేసే వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని అపరాధ రుసుం వసూలు చేస్తామని వివరించారు.

నేడు కార్పొరేషన్‌లో 'స్పందన'

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి ‘స్పందన’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని ఆయన సూచించారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి ఆసరా లేని వృద్ధులు, యాచకులకు జన వికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. సేవా సమితి అధ్యక్షులు తాహీర్, ప్రతినిధులు వాలేప్ప శివ, మస్తాన్ వలీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డిలు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందు భోజనాలను ఆరగించారు.

నూతన వసంతం.. వెల్లివిరిసిన సంతోషం

- కేక్ కట్ చేసి సంబరాలు
- ప్రముఖులకు శుభాకాంక్షల వెల్లువ


డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


రిమ్స్‌లో కేక్ కట్ చేస్తున్న ఆర్ఎంఓ, వైద్యులు, సిబ్బంది


ఆశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయిస్తున్న నాగవేణి


అనాథ శరణాలయంలో కేక్ కట్ చేస్తున్న రిమ్స్ సీఐ రామచంద్ర

కడప కార్పొరేషన్ : నూతన వసంతానికి ఘనంగా స్వాగతం పలికారు. కడప నగరంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. స్థానిక నమస్తే బోర్డు వద్ద 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పి. జయచంద్రారెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి గరుడాద్రి, యువజన నాయకులు పస్తం అంజి వేర్వేరుగా డిప్యూటీ సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిప్యూటీ సీఎంతో కేక్ కట్ చేయించారు.

- కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాల్మన్, నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీ క్రిష్టారెడ్డి పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు బి. లింగమూర్తి, గోవిందు నాగరాజు, బంగారు నాగయ్య యాదవ్ తదితరులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గురుస్వామి, శివయాదవ్, మధుసూదన్, నారాయణమ్మ పాల్గొన్నారు.
- కడప నగరం చిన్నచౌకులోని శ్రీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోషియేషన్ నాయకులు కొండారెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.
- స్థానిక రామరాజుపల్లెలో జ్యోతి క్లీనిక్‌లో డాక్టర్ ఓబుల్‌రెడ్డి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో..
కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాలల, వృద్ధుల ఆశ్రమాల్లో ఆశారేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి కేకులు పంచి పెట్టారు. నగరంలోని జువైనల్ హోం, బాలసదన్, అర్బన్ రెసిడెన్షియల్ హోం తదితర బాలల ఆశ్రమాల్లో తొలుత చిన్నారులతో కలిసి ఆమె కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చౌడేశ్వరీ, పద్మావతి, బృంద వృద్ధాశ్రమాల్లో పెద్దలతో కలిసి కేకును కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

స్వర్ణకారుల సంఘం మాజీ ప్రెసిడెంట్‌కు సన్మానం
కడప ఎడ్యుకేషన్: కడప నగరం బీకేఎం స్ట్రీట్‌లో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో స్వర్ణకారుల సంఘం మాజీ ప్రెసిడెంట్ డి సాబ్‌జాన్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హిదాయత్ ఆలీఖాన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, స్వర్ణకారుల సంఘం ప్రెసిడెంట్ అక్రమ్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్యువెలర్స్ అసోసియేషన్‌లో..
కడప కల్చరల్ : కడప జ్యువెలరీ అసోసియేషన్ సంస్థ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎస్ఎల్‌వీ జ్యువెలర్స్ అధినేత రమణ ఆధ్వర్యంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బంగారు రాజా, సయ్యద్ సలావుద్దీన్, అధ్యక్షులు ఆకుల రాజమోహన్ సంఘ సభ్యులందరినీ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కడప అర్బన్ : కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, ఎస్ఐలు పెద్ద ఓబన్న, సిద్దయ్య, నారాయణలతోపాటు సిబ్బంది కేక్ కట్ చేశారు. అక్కడికి వచ్చిన వారికి పంపిణీ చేశారు.

- కడపలో జిల్లాలో కోర్టుల మానిటరింగ్ సెల్ సీఐ మధుసూదన్‌రావు, తమ సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.
- రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 'అమ్మ ఒడి' అనాథ శరణాలయంలో అనాథ పిల్లల మధ్య కడప రిమ్స్ సీఐ కె. రామచంద్ర వేడుకలు నిర్వహించారు.
- కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా కేక్‌ను కట్ చేశారు. రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ వారు క్యాలెండర్లను ఆవిష్కరించారు. రిమ్స్‌లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, నాయకులు భాస్కర్, సుదర్శన్‌లతోపాటు సూపర్‌వైజర్ రమణయ్య, హెడ్ నర్సులు వెంకటలక్ష్మి, జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.
- రిమ్స్ శానిటేషన్, సెక్యూరిటీ విభాగం కాంట్రాక్టర్ జె.బాలనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా కేక్ కటింగ్ చేయించారు. సెక్యూరిటీ ఆఫీసర్ రాజన్న, సూపర్‌వైజర్‌లు సుబ్బరాయుడు, సిబ్బంది సుబ్బారెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే పోస్టల్ శాఖ లక్ష్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజల సంక్షేమమే పోస్టల్ శాఖ లక్ష్యమని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండ్ గౌస్ ఆజామ్ పేర్కొన్నారు. ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పోస్టల్ ప్రధాన శాఖ కార్యాలయంలో ఆయన ఉద్యోగులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్, రామశంకర్, ఇన్‌స్పెక్టర్ రెడ్డి బాష పాల్గొన్నారు.

- జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సంబరాలు జరుపుకొన్నారు.
- నగరంలోని సీపీఐ, సీపీఎం పార్టీ ప్రధాన కార్యాలయాల్లో పార్టీ శ్రేణుల మధ్య కేక్‌ను కట్ చేశారు. సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం కార్యాలయంలో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నేతలు


ఆర్టీసీ చైర్మన్‌కి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు జిల్లాకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య, ఉపాధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్‌లు ఇతర నాయకులతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన తనయుడు సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలను కలిసి సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పింఛన్ పెంపు సంబరాలు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మాధవి


పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్‌ను రూ.2750కి పెంచి నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారని 20వ డివిజన్ కార్పొరేటర్ వై.మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో పింఛన్ మొత్తాన్ని పెంచి, కొత్త పింఛన్లు మంజూరు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పింఛన్ల పెంపుపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ థ్యాంక్యూ సీఎం సార్ అని నినదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, వలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో పింఛన్ల పంపిణీ

- కడప నగరంలోని 33వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ప్రభుత్వం రూ.2750కి పెంచి ఇస్తున్న పింఛన్లను, కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. బెల్లంమండీలో బెడ్‌పై లేవలేని వ్యక్తికి వారు పింఛన్ అందజేశారు. జగనన్న ప్రభుత్వాన్ని అవ్వాతాతలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి గౌస్ పాల్గొన్నారు.
- స్థానిక 4వ డివిజన్‌లోని బుడ్డాయపల్లెలో 4/1 వార్డు సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ వినోద్ కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు.
- 48వ డివిజన్‌లోని రామరాజుపల్లెలో డివిజన్ ఇన్‌చార్జి డి.ఓబులేసు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు.
- 28/2 వార్డు సచివాలయం పరిధిలో కార్పొరేటర్ అరీఫుల్లా బాషా వృద్ధులు, వితంతువులకు, వికలాంగులకు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్లు ఎం. రాజగోపాల్, రఫీ, శ్వేతారెడ్డి పాల్గొన్నారు.
- 30వ డివిజన్‌లోని నాగరాజుపేటలో కార్పొరేటర్ షఫీ ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పింఛన్‌దారులు ఆశీర్వదించాలని కోరారు.
- నగర శివార్లలోని 3వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సుదర్శన్‌రెడ్డి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు.

క్రీస్తు దీవెనతో కొత్త జీవితాలు


ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న పాస్టర్ మత్తయ్యబాబు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు అందజేస్తున్న దీవెనలతో విశ్వాసులంతా కొత్త జీవితం ప్రారంభించాలని, ఆయన చూపిన మార్గంలో పయనించాలని పాస్టర్ మత్తయ్యబాబు సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం స్థానిక సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చికమిటీ సభ్యులు, ఇతర అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కృపా చర్చిలో...
కడప నగరం బుడగజంగం కాలనీలోని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా వాసులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా చిన్నారులకు మాస్కులు, సబ్బులు, పండ్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో బుడగజంగం జిల్లా అధ్యక్షులు దూపం రాజు, విశ్వాసులు రవితేజ, శాంతిరాజు, రోజా, అస్టీన్, చిరంజీవి, నరసయ్య, చందు, దావీదు, లీలావతి, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చిన్మయ మిషన్ కడప శాఖ అధ్యక్షులు, రెడ్డి సేవా సమితి ప్రతినిధులు


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న గాండ్ల సంఘం నాయకులు


క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న పద్మశాలి ఉద్యోగ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కరానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష పేర్కొన్నారు. ఆదివారం కడపలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(పీఎస్‌టీయూ)-2023 సంవత్సరానికి సంబంధించిన డైరీని రాష్ట్ర అధ్యక్షులు జమాల్‌రెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పివి సుబ్బారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రామలక్ష్మణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా సీపీఎస్ కో కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి వెంకటరామిరెడ్డిలు పాల్గొన్నారు.

రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో..
కడప కల్చరల్ : కడప నగరం రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఆదివారం 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చిన్మయ మిషన్ కడపశాఖ అధ్యక్షులు స్వామి తురియానంద, సంస్థ అధ్యక్షులు కె.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి జి.ఆదినారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేమన జయంతిపై హర్షం
రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 19న వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించడం పట్ల రెడ్డి సేవా సమితి హర్షం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఎన్నో సంవత్సరాలుగా తాము చేస్తున్న పోరాటం విజయవంతమైందని, ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు దేవిరెడ్డి రామచంద్రారెడ్డి, రెడ్డికుమారి, ఆనంద్‌కుమార్, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పద్మప్రియ చంద్ర ఓబుల్‌రెడ్డి, సభ్యులు సుధీర, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, రెడ్డి జనసంఘ్ అధ్యక్షులు ఎం.సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గాండ్ల సంఘం ఆధ్వర్యంలో..
కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర శివారులోని దుర్గమ్మ దేవాలయం ఎదురుగా గల గాండ్ల సంఘం కల్యాణ మండప స్థలంలో ఆదివారం సంఘం అధ్యక్షులు ఇసికాల రామప్ప, యువజన సంఘం అధ్యక్షులు నందారపు శివకుమార్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గాండ్ల సంఘ నేతలు కొత్తమద్ది నారాయణ, ప్రసాద్, గాండ్ల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల నేతృత్వంలో..
కడప ఎడ్యుకేషన్ : కడప పద్మశాలి భవన్‌లో ఆదివారం క్యాలెండర్, డైరీలను పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన ఆవిష్కరించారు. పద్మశాలి భవన్ అధ్యక్షులు అవ్వారు వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షులు, ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ గాజుల రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులు రాటాల గోపి, సలహాదారు మామిళ్ల వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సోము జ్ఞానశంకర్, మహిళా అధ్యక్షురాలు జూనపాటి వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి వెంకటసుబ్బయ్య, సంయుక్త కార్యదర్శి లోకేష్, సిద్దవటం వెటర్నరీ డాక్టర్ మేరువ సుబ్బరాయుడు, బాసట బాలజీ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్జీఓ'ల క్యాలెండర్ ఆవిష్కరణ
కడప రూరల్ : ఏపీ జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ కడప సిటీ యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన 2013 సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక నూతన కలెక్టరేట్‌లోని చాంబర్‌లో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి డీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారులకు శుభాకాంక్షలు
జిల్లా కలెక్టర్ విజయ్‌రామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్ తదితర జిల్లా అధికారులకు సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ నూతన సంవత్సరం సదర్భంగా మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సమితి అధ్యక్షులు తాహీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు దేవదాయ శాఖ సత్కారం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కల్చరల్ : జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డిలను ఆదివారం జిల్లా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్‌లు ఘనంగా సత్కరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తొలుత కలెక్టర్‌ను కలిసిన ఈ బృందం వేదపండితులు విజయ్‌భట్టర్ తదితరులు ఆయనకు వేదోక్తంగా ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఏసీ శంకర్ బాలాజీ తమ శాఖ సాధించిన విశేషాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషను కూడా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఆయనను ఘనంగా సత్కరించి దేవదాయ శాఖ ప్రచురించిన క్యాలెండర్లను అందజేశారు.

కమలాపురం ఎమ్మెల్యేచే..
కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన తనయుడు సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అనంతరం ఆ శాఖ ప్రచురించిన జిల్లా పుణ్యక్షేత్రాలు, ప్రముఖ ఆలయాలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. వేద పండితులు విజయ్‌భట్టర్ బృందం వారికి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేసింది.

'వైకుంఠ' దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

- వైష్ణవాలయాల్లో విశేష పూజలు
- ఉత్తర ద్వారం ద్వారా దర్శనం
- విద్యుత్ దీపాలతో అలంకరణ
- కనుల విందుగా సెట్టింగ్‌లు

కడప కల్చరల్ : వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలలో సోమవారం ఉత్తర ద్వార దర్శనానికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని వైష్ణవాలయాలలో ఇప్పటికే వైకుంఠ ద్వారాలు ఉన్న చోట వాటికి పూలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకారం చేశారు. ఆ ద్వారం నుంచి స్వామిని దర్శించుకునేందుకు బారికేడ్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వారాలు లేనిచోట ప్రత్యేకంగా అలంకారిత సెట్టింగ్ ద్వారాలను కనుల పండువగా ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని ఆలయాలలో ఉదయం ఐదు గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద ఆర్చీని ఏర్పాటు చేశారు. క్యూలైన్లు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుద్దీపాల కటౌట్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి. జయనగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. గడ్డిబజారు శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలో కూడా ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. స్థానిక రవీంద్రనగర్‌లోని శ్రీ రామాంజనేయస్వామి ఆలయంలో ఉదయం 6.30 గంటలకు పంచామృతాభిషేకం చేసి 8.30 గంటలకు అలంకార మండపంలో స్వామి గరుడ వాహనంపై విష్ణుమూర్తిగా అలంకరించనున్నారు. అనంతరం షోడసోపచారాలు, పుష్పార్చన, నివేదన, దశహారతులు నిర్వహిస్తారు. హౌసింగ్‌బోర్డు రామాలయంలో కూడా ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం ఉంటుంది. బీకేఎం వీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, అదే వీధిలోని భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కూడా ఉదయం 5 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం, మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించనున్నారు. చిన్న బెస్తవీధిలోని బాలపోలేరమ్మ ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

నేడు కల్యాణోత్సవం
వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని కడప నగరం హనుమప్పవీధిలోగల నడివీధి గంగమ్మకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోపాల్‌సింగ్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో భక్తుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.